లాభాలను తక్కువ చూపి పొట్టగొడ్తరా?

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): సింగరేణి సంస్థ 2023-24లో రూ.4,701 కోట్ల లాభాలు ఆర్జించిందని, కానీ ప్రభుత్వం రూ.2,412 కోట్లకు పరిమితం చేసి అందులో 33 శాతం వాటా మాత్రమే కార్మికులకు ఇచ్చి వారి పొట్టగొట్టిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.2,289 కోట్ల లాభాలకు సంబంధించిన బోనస్ ఎగ్గొట్టిందని, వాస్తవానికి ఇచ్చింది 16.90 శాతమేనని ఆరోపించారు. బోనస్ సింగరేణి కార్మికుల హక్కు అని, కాంగ్రెస్ సర్కారు కార్మికులకు ఎక్కువ బోనస్ ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సింగరేణి అభివృద్ధి పేరుతో లాభాలను తగ్గించి చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆల్‌టైం రికార్డు ఉత్పత్తి సాధించిందని, అయినా ఒక్కో కార్మికుడికి గతేడాది కంటే రూ.20 వేలు మాత్రమే అదనంగా బోనస్ ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ ఇలా లాభాలను తగ్గించి చూపలేదని తెలిపారు.

సింగరేణిలో బోనస్.. బోగస్

- లాభాల్లో 50 శాతం కోత విధించిన ప్రభుత్వం
- కార్మికుల చెమటకు సెల్యూట్ చేసింది కేసీఆరే
- నికరలాభాల్లో నుంచే 33 శాతం బోనస్ ఇవ్వాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులకు 33 శాతం బోనస్ ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు బోగస్ మాటలు చెప్పిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కార్మికులకు ఇచ్చే లాభాల్లో సీఎం కోత విధించారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే మొత్తం రూ.4,701 కోట్లల్లో కార్మికులకు 33 శాతం బోనస్ ప్రకటించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపికబురు అని చెప్పి సీఎం చేదు నిజాన్ని దాచారని ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థ లాభాల వాటాలో 50 శాతం కోత విధించడాన్ని ఆయన ఖండించారు. నెత్తురును చెమటగా చేసిన కార్మికుల ఆశలను రేవంత్ సర్కార్ అడియాశలు చేసిందని మండిపడ్డారు. 2008-09 నుంచి 2010-11 వరకు సమైక్య రాష్ట్రంలో సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చిన వాటా కేవలం 16 శాతమేనని, ఆ చరిత్రను సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి గుర్తుచేశారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం వెంట నడిచిన సింగరేణి కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని స్వరాష్ట్రంలో నాటి సీఎం కేసీఆర్ ఎంతో ఉదారతతో వ్యవహరించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది (2014-15)లోనే సింగరేణి లాభాల నుంచి కార్మికులకు 21 శాతం వాటాను ప్రకటించారని తెలిపారు. నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల బాటలో పట్టించి కార్మికుల కష్టానికి గుర్తింపుగా ఆర్జించిన నికర లాభాల నుంచి కార్మికులకు ప్రతి ఏడాది వాటాను ఇస్తూ సింగరేణి కార్మికుల చెమటకు సెల్యూట్ చేసిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌దేనని తేల్చిచెప్పారు. 2022-23లో రూ.2,222 కోట్ల లాభాలు వస్తే కార్మికులకు ఏకంగా 32 శాతం (దాదాపు రూ.710 కోట్ల) వాటాను ప్రకటించిన కేసీఆర్ కార్మికుల కష్టానికి గుర్తింపు, గౌరవాన్ని ఇచ్చారని తెలిపారు.

కార్మికులకు 1,550 కోట్లు దక్కాలి

2023-24లో వచ్చిన సింగరేణి సంస్థ లాభాలు రూ.4,701 కోట్లని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందులో 33 శాతం లాభాలు పంచితే ఆ మొత్తం రూ.1,550 కోట్లు కార్మికులకు దక్కాల్సి ఉన్నదని తెలిపారు. కానీ కార్మికులకు ప్రకటించింది కేవలం రూ.796 కోట్లేనని, ఈ లెక్కన 16.9 శాతం మాత్రమే బోనస్‌గా ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. కార్మికులకు హక్కుగా రావాల్సిన మిగతా వాటా రూ.754 కోట్లు ఏమైనట్టు? అని ప్రశ్నించారు. ఆల్ టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా గతం కంటే ఒక్కో కార్మికుడికి అదనంగా ఇచ్చేది రూ.20 వేలేనా? అని సర్కార్‌ను నిలదీశారు.

లాభాలు తెచ్చిన కార్మికులకు చీకట్లా?

అందరికీ వెలుగులు అందించే సింగరేణి కార్మికుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి నింపే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో కార్మికులకు జరిగిన అన్యాయం కంటే స్వరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నదని పేర్కొన్నారు. బోనస్ విషయంలో కార్మికులకే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకూ అన్యాయమే చేసిందని, ఉద్యోగుల సంఖ్యను కుదించి రూ.5 వేల బోనస్‌ను కొందరికే పరిమితం చేసిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర ప్రగతిలో ఎంతో కీలకంగా ఉన్న సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే బీఆర్‌ఎస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. పదేండ్లలో సింగరేణి సంస్థ లాభాలు, కార్మికులకు ఇచ్చిన బోనస్, వాటా వివరాల జాబితాను హరీశ్‌రావు విడుదల చేశారు.

సంవత్సరం	వచ్చిన లాభం (కోట్లలో)	కార్మికులకు పంచిన వాటా (కోట్లలో)	వాటా శాతం
2023-24	4,701	796	16.90
2022-23	2,222	700	32
2021-22	1227	368	30
2020-21	272.64	79.07	29
2019-20	993	278	28
2018-19	1765	494	28
2017-18	1212	327	27
2016-17	395	99	25
2015-16	1066	245	23
2014-15	490	103	21

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

కార్మికులకు 1550 కోట్లు ఇవ్వాలి

- కార్మికులకు ప్రభుత్వం, గుర్తింపు సంఘం మోసం
- కలిసి వచ్చే సంఘాలతో పోరాడుతాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబర్ 21: సింగరేణి కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.1,550 కోట్లు ఇవ్వాల్సిందేనని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు మునుపెన్నడూ లేనంతగా రూ.70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి, రికార్డుస్థాయిలో బొగ్గు రవాణా చేశారని వివరించారు. 2023-24 వార్షిక సంవత్సరానికి రూ.4,701 కోట్ల నికర లాభం వచ్చినట్టు ప్రభుత్వం పేర్కొన్నదని, అందులో కార్మికులకు 33 శాతం వాటా రూ.1,550 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.796 కోట్లు మాత్రమే ఇవ్వడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని నిలదీశారు. ప్రతి కార్మికుడికి లాభాల్లో వాటా కింద రూ.4 లక్షలు రావాల్సి ఉన్నదని, కానీ ప్రభుత్వం చేసిన మోసానికి గెలిచిన కార్మిక సంఘం వంతపాడటంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షల మేర లాభాలను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం, సింగరేణి గుర్తింపు సంఘం మోసాన్ని ఎండగట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు రామ్మూర్తి, కొమురయ్య, రవి, పోలాడి శ్రీనివాసరావు, జోసఫ్, రవీందర్‌రెడ్డి, సాయి, రాజ్‌కుమార్, పల్లె సురేందర్, జనగామ మల్లేశ్, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, సతీశ్ పాల్గొన్నారు.

లాభాల్లో వాటాకు కోతెందుకు?

- కాసిపేట 2 ఇంక్లైన్ గని కార్మికుల ప్రశ్నలవర్షం
- ఐఎన్‌టీయూసీ నేతలను నిలదీసిన కార్మికులు
- మిన్నకుండిపోయిన నేతలు

కాసిపేట, సెప్టెంబర్ 21: సింగరేణి సంస్థకు వచ్చిన లాభం రూ.4,701 కోట్లు. దానిలో రూ.2,283 కోట్లను మినహాయించి, రూ.2,412 కోట్లలో నుంచే 33 శాతం వాటా ప్రకటించారు. మునుపెన్నడూ లాభంలో సగం పక్కన పెట్టి మిగతా సగంలో వాటా ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో చేయని ఆ పని ఇప్పుడు ఎందుకు చేస్తున్నారు? అని మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో కార్మికులు ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో ఆ నేతలను అడ్డుకున్నారు. గని పైకి వెళ్లి ఐఎన్‌టీయూసీ నాయకుడు పుల్లూరి లక్ష్మణ్ సహా పలువురిని నిలదీశారు. 'సింగరేణికి రూ.4,701 కోట్ల లాభం వస్తే అందులో 33 శాతం అంటే ఎంత వస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. లాభాల్లో 33 శాతం అంటే రూ.1,550 కోట్లు రావాలి. కానీ ప్రకటించింది రూ.796 కోట్లేనని చెప్పారు. లాభాల్లో రూ.2,283 కోట్లను పక్కన పెట్టి మిగిలిన దాంట్లో వాటా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సగానికి ఎక్కువ బోనస్ తీసుకొని, మిగిలింది ఇస్తే అది 33 శాతం ఎలా అవుతుందని నిలదీశారు. ఎంత లెక్కలు చేసినా ప్రభుత్వం ఇచ్చేది 17 శాతానికి లోపేనని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ మొదలైనప్పుడు ఎంత వాటా ఇచ్చారో, ఇప్పుడు మళ్లీ అక్కడికే తీసుకొచ్చారంటూ మండిపడ్డారు. నికర లాభంలో 33 శాతం ఇవ్వాలని, లేకపోతే 33 శాతం ఇస్తున్నట్టు చేసిన ప్రకటనను వెనక్కి తీసుకొని, ఎంత ఇస్తున్నారో బయటికి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు లెక్కలేసి మరీ చెప్పడంతో ఐఎన్‌టీయూసీ నాయకులు సమాధానం చెప్పలేక పోయారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్ని వచ్చాయి? ఇప్పుడు ఎంత వచ్చాయని ప్రశ్నించారు. లాభాల వాటా, బోనస్‌పై కార్మికులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు కార్మిక సంఘం నాయకులు సమాధానాలు చెప్పలేకపోయారు. కేసీఆర్ ఉన్నప్పుడు లాభాల్లో వాటా ఎక్కువ వచ్చిందని, ఇప్పుడు లాభాలు ఎక్కువ శాతం, ఇచ్చేది తక్కువ శాతం ఉన్నదని, ఆ డబ్బు ఎటు వెళ్తున్నదో చెప్పాలంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరద పోయినా కన్నీళ్లు పారాలా?

- బాధితులకు సాయంపై చిత్తశుద్ధి ఏదీ?
- మృతుల కుటుంబాలకు 25లక్షలు ఇవ్వండి
- సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): 'వరద పోయినా ఇంకా బాధితుల కన్నీళ్లు పారాలని ప్రభుత్వం చూస్తున్నదా? రేవంత్ రెడ్డి సర్కార్ ఇకనైనా నిర్లక్ష్యం వీడి వరద బాధితులకు తగిన సాయం చేయాలి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు చెల్లించాలని, ఇండ్లు కూలి, సామాన్లు నష్టపోయిన వారికి రూ. 2 లక్షలు, పూర్తిగా ఇండ్లు కూలినవారికి రూ.10 లక్షల చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టం కింద ఎకరాకు రూ. 25వేలు అందించి మాట నిలుపుకోవాలని చెప్పారు. పశువులు నష్టపోయిన వారికి లక్ష సాయం, చిరువ్యాపారులకు రూ. 5లక్షల పరిహారంతో పాటు వడ్డీ లేని రుణాలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ శనివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. భారీ వరదలతో ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్ తదితర జిల్లాల్లో 33 మంది ప్రాణాలు కోల్పోయారని, రూ.5,438 వేల కోట్ల ఆస్తి నష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.

వారికి ఏం సమాధానం చెప్తరు?

వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్ విమర్శించారు. '9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కనీసం 9 మందిని కూడా కాపాడే నాయకుడే కరువయ్యాడని ఖమ్మండి జిల్లా ప్రజలు కన్నీటి పర్యంతమవుతూనే ఉన్నారు' అని గుర్తుచేశారు. ప్రభుత్వ చేతగానితనంతో తమ వారిని కోల్పోయామని బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారని తెలిపారు. వరద విషాద పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చిరునవ్వులు చిందిస్తూ.. చేతులూపుతూ ర్యాలీ తీసిన దృశ్యాలు మరింత కుంగదీస్తున్నాయన్నబాధితుల ఆవేదనకు ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణ సాయం కింద ముందు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పి ఆ తర్వాత నష్టం స్థాయిని బట్టి సాయం చేస్తామనిచెప్పడం బాధితుల్లో అయోమయాన్ని కలిగించిందని చెప్పారు. కట్టుబట్టలతో మిగిలిన వారికి ప్రభుత్వంతోపాటు స్థానిక మంత్రి పొంగులేటి కలిపి కేవలం రూ.16,500 అని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 15,096 మందిని రూ.16,500 సాయం అందించేందుకు గుర్తించి, రూ.18వేలు అందించేందుకు కేవలం 146 మందినే గుర్తించడంలో సర్కారు ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు పది రోజుల్లోనే రైతులకు అందిస్తే కాంగ్రెస్ నానాయాగీచేసిందని, అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.25 వేలు ఇస్తామని నాడు రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట, అధికారంలోకి రాగానే మరోమాట చెప్పి ప్రజలను మోసం చేయటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తుడని విమర్శించారు. మీడియా మేనేజ్‌మెంట్‌ను వీడి ప్రకృతి వైపరీత్యాల నిర్వహణపై దృష్టి సారించాలని హితవు పలికారు.

సింగరేణి కార్మికులకు సీఎం దగా

- ఇచ్చిన బోనస్ కేవలం 16.90 శాతమే
- ఒక్కో కార్మికుడికి వచ్చేది 1.90 లక్షలు
- ప్రభుత్వం చెప్పుకునేది 33 శాతమా?
- ఆ లెక్కప్రకారం 3.70 లక్షలు రావాలి
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు నమ్మించి నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికుల చెమటను, కష్టార్జితాన్ని దోచుకున్నదని ఒక ప్రకటనలో విమర్శించారు. 2023-24 సంవత్సరానికి సింగరేణి సంస్థ రూ.4,701 కోట్ల నికర లాభం ఆర్జిస్తే, కేవలం రూ.796 కోట్లు కార్మికులకు ఇచ్చి 33 శాతం ఇచ్చామని అబద్ధాలు చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. అందులో రూ.2,289 కోట్లను ఎందుకు దాచారని ప్రశ్నించారు. కేవలం రూ.2,412 కోట్లను లాభంగా చూపించి అందులో నుంచి 33 శాతం ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రభుత్వ దగా వల్ల ఒక్కో కార్మికుడు రూ.1.80 లక్షల చొప్పున కోల్పోతున్నాడని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పున్నట్టు లాభాల్లో 33 శాతం చొప్పున కార్మికులకు ఇస్తే.. 33 శాతం (4,701 కోట్ల) వాటా కింద రూ.3.70 లక్షలు వచ్చేవని తెలిపారు. సర్కారు కుట్రపూరితంగా రూ.1.90 లక్షలే ఇచ్చి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. నిరుడు సంస్థకు వచ్చిన నికర లాభం రూ.2,222 కోట్ల నుంచి నిరుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులకు 32 శాతం వాటా కింద రూ.700 కోట్లను కార్మికులకు పంచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్టు వారికి 33 శాతం బోనస్ ఇవ్వలేదని, ఇచ్చింది కేవలం 16.90 శాతం వాటా మాత్రమేనని తెలిపారు.

ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహారదీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ నాయకులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- కాంగ్రెస్ మ్యానిఫెస్టో, హామీలను అమలుచేయాలి
- టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న
- ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. పాలనాపగ్గాలు చేపట్టి 10 నెలలు దాటినా దీనిపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశలవారీ ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు లేక ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికుల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే సెలవు మంజూరు కోసం శవంతో సెల్ఫీ పెట్టాలని అధికారులు అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ బాండ్ బకాయిలను ఉద్యోగులందరికీ చెల్లించాలని, 2017 వేతన సవరణ చట్టప్రకారం బకాయిలు ఇవ్వాలని జేఏసీ వైస్ కన్వీనర్ మౌలానా కోరారు. 2021 వేతన సవరణను అమలు చేయాలని జేఏసీ కో కన్వీనర్ యాదయ్య డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు రూ.900 కోట్లు, పీఎఫ్‌కు రూ.1,475 కోట్లు, ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌బీటీకి రూ.650 కోట్ల చొప్పున సంస్థకు అందజేయాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ల విషయంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కో కన్వీనర్ సురేశ్, కోకన్వీనర్ యాదగిరి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎల్ బాల్‌రాజు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పీ సుభాశ్, కండక్టర్ల ఐక్యవేదిక బాధ్యులు కేఆర్ కుమార్, తేజావతి పాల్గొన్నారు.

అంగట్లో రేషన్ డీలర్ పోస్టులు

- పోస్టులు అమ్ముకుంటున్నారన్న కాంగ్రెస్ కార్యకర్త
- కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే రేషన్ దుకాణం
- బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత కక్ష

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ డీలర్ల నియామక ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలకే కట్టబెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోస్టులను డబ్బులకు అమ్ముకుంటున్నారంటూ కాంగ్రెస్ కార్యకర్త మీడియా ఎదుట ఆరోపించడం బలాన్ని చేకూరుస్తున్నాయి. కండువా కప్పుకుంటేనే దుకాణం.. లేదంటే ఉన్న పోస్టు ఊస్టేనంటూ ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నట్టు తెలిసింది.

ప్రకటించని జాబితా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 58 కొత్త రేషన్ డీలర్ పోస్టులకు 29న నోటిఫికేషన్ జారీచేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులు కాగా, 15న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. 830 మంది దరఖాస్తు చేసుకోగా, 765 మంది పరీక్షకు హాజరు హాజరయ్యారు. శనివారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మార్కుల జాబితాను అధికారులు ప్రకటించలేదు. దీంతో అభ్యర్థులంతా ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కుల జాబితా బోర్డుపై ప్రదర్శించిన తర్వాతే ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేరుకే పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని, పోస్టులన్నీ అమ్ముకున్నారంటూ ఓ కాంగ్రెస్ కార్యకర్త మీడియా ముందు వెల్లడించారు. తన వద్ద అన్ని ఆధారాలున్నాయని, ఎవరికి డీలర్‌షిప్‌లు వస్తాయో కూడా తాను బయటపెడుతానని ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త కావాటి మహిపాల్ స్పష్టం చేశారు. తమ ఊళ్లో ఒక ముదిరాజ్, వెలమ వర్గానికి చెందిన ఇద్దరు మహిళలకు పోస్టులు వచ్చాయన్న సమాచారం ఉన్నదని చెప్పారు. రిజల్ట్ తర్వాత తాను చెప్పిన పేర్లు ఉండకపోతే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఇదేంటని ప్రశ్నిస్తే 'నా ఇష్టం ఉన్నోళ్లకే ఇచ్చుకుంటానని, ఎస్సీలు, బీసీలకేనా? మా ఓసీలకు ఇచ్చుకోవద్దా? ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ తనను బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ఇయ్యాళ ఇంకెన్ని సీట్లు అమ్ముకునేటోడివో' అంటూ ఆరోపించారు. 'టీఎస్‌పీఎస్సీలో అవినీతి జరిగిందని గతంలో రోడ్లెక్కి ధర్నాలు చేశాం. ఇప్పుడు కాంగ్రెసోళ్లే రేషన్ డీలర్ల సీట్లు అమ్ముకుంటుంటే మనం రోడ్లెక్కుదామా? బీఆర్‌ఎస్ వాళ్లను ఎక్కుమందామా? వాళ్లకు ఆధారాలు ఇద్దామా?' అని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ఆరోపణలపై ఏం స్పష్టత ఇస్తారో?

డీలర్ పోస్టులు కాంగ్రెస్ నేతలు అమ్ముకున్నారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ కార్యకర్త మహిపాల్

కండువా కప్పుకుంటేనే దుకాణం..

'కండువా కప్పుకో.. దుకాణం నీకే ఇస్తా. లేదంటే నీ పోస్టు ఊస్ట్' అని కేకే మహేందర్ రెడ్డి తనను బెదిరించారని బీఆర్‌ఎస్ కార్యకర్త తాటి వెంకన్న మీడియా ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. మహిళా సంఘాలకు ఇచ్చిన రేషన్ దుకాణం నడుపుకుంటున్న తాను బీఆర్‌ఎస్ కార్యకర్త కావడం పాపమా? అని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురి రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేసి, వారిస్థానంలో కొత్తవారిని నియమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దుకాణాలు అమ్ముకున్నరు: బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

రేషన్ దుకాణాల డీలర్‌షిప్‌లను ముందే అమ్ముకుని నామమాత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి వాళ్ల అనుచరులకు ముందే ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూల కథ నడిపిస్తున్నారంటూ విమర్శించారు. ఈ ఇంటర్వ్యూలు రద్దు చేసి మార్కుల జాబితా ప్రకటించిన తర్వాతే మళ్లీ పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆర్డీవోను కలిసి డిమాండ్ చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్ 2 లక్షలు ఎప్పుడిస్తరు?

- సర్కారుకు రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్ల సూటి ప్రశ్న
- నెలలు గడుస్తున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రిటైర్మెంట్ బెనిఫిట్ డబ్బులు ఇంకెప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ టీచర్లు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏండ్లు నిండిన టీచర్లను రెండు నెలల క్రితం తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం.. టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.1 లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని మాట ఇచ్చింది. నాలుగు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేస్తామని ఆ సందర్భంగా మంత్రి హామీ కూడా ఇచ్చారు. కానీ.. నెలలు గడుస్తున్నా ఎలాంటి జీవో విడుదల కావటం లేదని ప్రభుత్వంపై రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, రెండు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సంఘం రాష్ట్ర నాయకురాలు నల్లభారతి తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న బెయిల్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు మేకల తిరుపతన్న దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. శనివారం ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ జువ్వాది శ్రీదేవి తీర్పును రిజర్వులో ఉంచుతున్నట్టు ప్రకటించారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయినందున బెయిల్ మంజూరు చేయాలని తిరుపతన్న తరఫు న్యాయవాది వీ సురేందర్ రావు కోరారు. వాదిస్తూ, ఎస్‌ఐబీలో సభ్యుడిగా ఉన్న పిటిషనర్ తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించారని, తప్పు చేయలేదని చెప్పారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు స్పందిస్తూ, ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశామని, అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తామని, బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు.

పీఏసీ చైర్మన్ ఎంపిక ఎలా జరిగింది?

ఎలక్షన్ ద్వారానా? లేక సెలెక్షన్ ద్వారా చేశారా?

- అరికెపూడి గాంధీ నామినేషన్ వేశారా?
- హరీశ్‌రావు వేసిన నామినేషన్ ఏమైంది?
- స్పీకర్‌ను నిలదీసిన బీఆర్‌ఎస్ సభ్యులు
- స్పందించని స్పీకర్.. మౌనమే సమాధానం
- హాట్ హాట్‌గా పీఏసీ తొలి సమావేశం
- వాకౌట్ చేసిన బీఆర్‌ఎస్ సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ప్రజాపద్దుల కమిటీ తొలి సమావేశం రసాభాసగా మారింది. ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ నియామకంపై బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను నిలదీశారు. చైర్మన్‌ను ఎలక్షన్ ద్వారానా? లేక సెలెక్షన్ ద్వారా ఎంపికా చేశారా అని ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయానికి స్వస్తి చెప్పి ప్రధాన ప్రతిపక్ష నేతను సంప్రదించకుండా చైర్మన్‌ను ఎలా ఎంపిక చేశారని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి అడిగారు. అరికెపూడి గాంధీని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారని ప్రశ్నించారు. తమకు సమాధానం చెప్పిన తరువాతనే సమావేశాన్ని కొనసాగించాలని పట్టుబట్టారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో శనివారం జరిగిన ఈ సమావేశానికి స్పీకర్‌తోపాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ లేచి పీఏసీ చైర్మన్ ఎంపికను ప్రస్తావించారు. తామడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి సమావేశాన్ని కొనసాగించాలని కోరారు. అయితే స్పీకర్ సహా, మంత్రి, మండలి చైర్మన్.. మౌనమే సమాధానం అన్నట్టు వ్యవహరించారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

లోక్‌సభలో ఇచ్చారు కదా?

అనంతరం మీడియా పాయింట్ వద్ద వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటరీ వ్యవస్థలో పీఏసీ అత్యంత కీలకమైనదని అన్నారు. సభలో ప్రజల గొంతుకగా వ్యవహరించే ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం అనవాయితీగా వస్తున్నదని చెప్పారు. ఈ సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఏసీ నియామకంపై అభ్యంతరాలు, అనుమానాలు ఉన్నాయని, దీనిపై వివరణ ఇవ్వాలని స్పీకర్‌ను కోరామని తెలిపారు. అసెంబ్లీ రూల్ 250 ప్రకారం పీఏసీ చైర్మన్‌ను ఎలక్షన్ ద్వారా ఎన్నుకోవాలన్న నిబంధన ఉన్నదని గుర్తుచేశామని చెప్పారు. పీఏసీ చైర్మన్ పదవి కోసం ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ పక్షాన తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ముగ్గురు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఇద్దరు ఎమ్మెల్సీలు ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ పేర్లు ఇచ్చామని తెలిపారు. వారందరూ నామినేషన్ వేశారని చెప్పారు. అరికెపూడి గాంధీ నామినేషన్ వేశారా? హరీశ్‌రావు నామినేషన్ ఎటు పోయింది? అని స్పీకర్‌ను అడిగామన్నారు. గాంధీ నామినేషన్ వేస్తే ఆరుగురు సభ్యులవుతారని, అప్పుడు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. తమ ప్రశ్నలకు స్పీకర్ సమాధానం ఇవ్వలేదని, మౌనంగా ఉండిపోయారని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షమైన కాంగ్రెస్ సభ్యులకు పీఏసీ చైర్మన్ పదవిని ఇచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో కూడా ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు.